హైకోర్టు ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రాంగణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ఎస్సీ,ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం చైర్మన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే సుప్రీంకోర్టు ప్రాంగణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. 2024 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి హామీ ఇచ్చారన్నారు. ఇందులో భాగంగా విగ్రహం పునాది కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన ఆశయల సాధనలో భాగంగా విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు.

బాలికపై వృద్ధుడి లైంగిక వేధింపులు

కాచిగూడ: ఓ బాలికను ఓ వృద్ధుడు లైంగికంగా వేధించిన సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..కాచిగూడ ప్రాంతానికి చెందిన వృద్ధుడు (60) ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. అదే అపార్ట్‌మెంట్‌లో ఉండే బాలిక (14)కు మాయమాటలు చెప్పి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాలిక తల్లి దండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కాచిగూడ: మహిళ మెడలోని మంగళసూత్రం చోరీకి గురైన సంఘటనపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుర్రంగూడ ప్రాంతానికి చెందిన యోగేశ్వరాచారి తన భార్యతో కలిసి ఈ నెల 20న వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతి నుంచి కాచిగూడకు బయలు దేరాడు. అలంపూర్, జోగులాంబ రైల్వే స్టేషన్ సమీపంలో ఆమె మెడలోని 23 గ్రాముల మంగళ సూత్రం కనబడలేదు. బుధవారం బాధితులు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం కేసును మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

1న మాదిగ అమరవీరుల సంస్మరణ సభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మార్చి 1న మాదిగ అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా.గోవిందు నరేష్ తెలిపారు. బుధవారం (ఎంఎస్ఎఫ్) నాయకుల సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఎంఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులు మంద రాజు మాదిగ అధ్యక్షత వహించగా గోవిందు నరేష్ ముఖ్యఅతిథిగా హాజరై పలు అంశాలపై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణలో రిజర్వేషన్ల కేటాయింపులు శాస్త్రీయంగా జరగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్‌మాదిగ, అధికార ప్రతినిధి బోర్ర భిక్షపతిమాదిగ పాల్గొన్నారు.

నిజాం కాలేజీలో యూజీసీ న్యాక్ బృందం పర్యటన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అనుబంధ నిజాం కాలేజీని యూజీసీ న్యాక్ అధికారుల బృందం ఈ నెల 24, 25 తేదీలలో పర్యటించినట్లు అధికార వర్గాలు బుధవారం తెలిపారు. న్యాక్ గుర్తింపు కోసం కాలేజీ పనితీరు, నాణ్యత ప్రమాణాలను అంచనా వేసి గుర్తింపు ఇచ్చేందుకు అధికారుల బృందం పర్యటించిందని పేర్కొన్నారు. ప్లేస్‌మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఈటీసీ, పరీక్షల విభాగం, విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, క్రీడా విభాగంతో పాటు ఆర్ట్స్, సోషల్ సైన్స్, కామర్స్, సైన్స్, మేనేజ్‌మెంట్ కోర్సుల విభాగలను సందర్శించి అధ్యాపకులతో మాట్లాడినట్లు ప్రిన్సిపల్ ప్రొ.ఏవీ రాజశేఖర్ తెలిపారు.

'కేర్'లో అరుదైన శస్త్రచికిత్స

చాదర్‌ఘాట్: మలక్‌పేట కేర్ హాస్పిటల్ అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు వివరాలు వెల్లడించారు. నల్ల మల్ల రాజు (39) పది నెలలుగా తల నిర్మాళ్యం (గిడ్డీనెస్) సమస్యతో బాధపడుతూ పలు ఆసుపత్రుల్లో చూపించుకున్నా నయం కాలేదు. మలక్‌పేట కేర్ హాస్పిటల్‌లో ప్రముఖ న్యూరోసర్జన్ వైద్యుడు డాక్టర్ మహ్మద్ హమీద్‌ను సంప్రదించగా ఆయన వైద్య బృందంతో కలిసి అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు.

విద్యుత్ సమస్యలు రానివ్వొద్దు

సైదాబాద్: వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆమె సంబంధిత అధికారులతో కలిసి డివిజన్‌లోని కరణ్‌బాగ్ కాలనీలో పర్యటిస్తూ వీధి దీపాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు, రవి, శరత్, రామకృష్ణారెడ్డి, త్రిమూర్తి, ఉస్మాన్ పాల్గొన్నారు.



సామూహిక రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు



శివంలో..



దేవుడి తోటలోని శివాలయంలో భక్తుల సందడి

ఓం నమఃశివాయ



శంకరమఠంలో మహేశ్వరి అలంకరణలో శారదామాత

ఘనంగా శివరాత్రి వేడుకలు • వాడవాడలా పంచాక్షరి ప్రతిధ్వనులు

ఆలయాల్లో భక్తుల రద్దీ | పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు

శివరాత్రి సందర్భంగా బుధవారం ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. డివిజన్ పరిధిలోని అన్ని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శివరాతిం్ర జాగరణ సందర్భంగా ఆయా ఆలయాల్లో రాత్రి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పండ్లు, పూలు, పూజా సామగ్రి కొనుగోలు దారులతో మార్కెట్‌లలో రద్దీ నెలకొంది. ఓ నమఃశివాయ అంటూ భక్తులు పంచాక్షరి మంత్రాన్ని పఠిస్తూ భక్తితో శివుడిని దర్శించుకుని పూజలు చేశారు.

– ముషీరాబాద్, అంబర్ పేట్ జోన్ బృందం



శంకరమఠంలోని చంద్రమౌళీశ్వరస్వామి..



కాచిగూడ నెహ్రూనగర్‌లో..





ముషీరాబాద్ గౌరీ శంకర దేవాలయంలో..



దోమలగూడ హనుమాన్ టెంపుల్‌లో..




కవాడిగూడ శివాలయంలో..



బాలత్రిపుర సుందరీదేవి ఆలయంలో..



కాశీ విశ్వనాథునికి పూజలు చేస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్ దంపతులు





బర్కత్‌పుర శివాలయంలో..



వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో..



లక్ష్మీగణపతి దేవాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం..



దేవుడి తోటలోని శివాలయంలో పూజల్లో పాల్గొన్న ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్..

భక్తిభావంతోనే పుణ్యఫలం

కాచిగూడ: భగవన్నామస్మరణ చేస్తూనే సమాజ సేవలో ఉంటూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవచ్చునని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని యాత్ర కమిటీ చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన 31వ అఖండ జ్యోతి రథ యాత్రను బుధవారం బర్కత్‌పుర యాదాద్రి భవన్ వద్ద కేంద్రమంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ నిరంతరం భక్తిభావంతోనే పుణ్యఫలం లభిస్తుందని, ఎన్ని పనులున్నా భగవంతుని సన్నిధిలో కాసేపు గడపడానికి సమయాన్ని కేటాయించాలన్నారు. రథయాత్ర మార్చి 1న యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్ పడాల, యం.ఎస్.ధరణి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, నంద కిషోర్ యాదవ్, చిట్టి శ్రీధర్, సుభాష్ పటేల్, బుచ్చిరెడ్డి, చంద్రశేఖర్‌రావు, దిడ్డి బాలాజీ, సత్యనారాయణ గౌడ్, లక్ష్మారెడ్డి, ఉపేందర్‌రావు, దుగ్యాల పవన్‌కుమార్, బొమ్మల సుదీష్ కుమార్, ఎ.గణపతి తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహ స్వామి అఖండ జ్యోతియాత్రను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

నీరా కేఫ్‌ను కల్లు గీత కార్పొరేషన్ పరిధిలోకి తేవాలి



మాట్లాడుతున్న రాజేందర్ పటేల్ గౌడ్

కాచిగూడ: నీరా కేఫ్‌ను ఎత్తివేయాలనే ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే విరమించుకుని నీరా కేఫ్‌ను కల్లుగీత కార్పొరేషన్ పరిధిలోకి తీసుకురావాలని బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నింబోలిఅడ్డలోని బీసీ మహాసభ కార్యాలయంలో బీసీ మహాసభ ప్రతినిధులు డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, ప్రదీప్‌గౌడ్, భూషణ్ భాస్కర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కల్లుగీత కార్మికులకు చెట్ల పెంపకానికి 5 ఎకరాల స్థలం కేటాయించాలన్నారు. ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడి చనిపోయిన గీత కార్మికుడికి రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఎక్స్‌గ్రేషియా పెంచాలని కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలని కోరారు.

ఘనంగా ప్రొటీన్ దినోత్సవం

బంజారాహిల్స్: మన శరీర ఎదుగుదలలో, ఆరోగ్యం విషయంలో ప్రొటీన్ కీలక పాత్ర పోషిస్తుందని ప్రొటీన్ అనేది శరీర నిర్మాణానికి, ఎదుగుదలకు ఎంతో దోహదం చేస్తుందని పౌల్ట్రీ ఇండియా అధ్యక్షులు ఉదయ్ సింగ్ బయాస్ అన్నారు. బుధవారం ప్రపంచ ప్రొటీన్ దినోత్సవం సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని సంస్థ కార్యాలయంలో పౌల్ట్రీ ఇండియా, ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మ్యాన్‌ఫ్యాక్చరర్స్ అసోసియేషన్(ఐపీఈఎంఏ) ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్ సింగ్ బయాస్ మాట్లాడుతూ దేశంలో 73 శాంతి మంది ప్రొటీన్ లోపంతో బాధపడుతున్నారని జనాభాలో 17 శాతం మంది తక్కువ బరువు, వాటివల్ల కలిగే సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గుడ్డులో అత్యంత విశేషమైన పోషకాలు లభ్యమవుతాయని అందువల్ల ప్రతి ఒక్కరు రోజు ఒక గుడ్డు తప్పనిసరిగా తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.



ప్రొటీన్ దినోత్సవంలో పాల్గొన్న పౌల్ట్రీ ఇండియా ప్రతినిధులు

ఘనంగా సామూహిక రుద్రాభిషేకం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్కేపురంలోని శ్రీశృంగేరి జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం (శ్రీ శృంగేరి శంకర మఠం)లో సువర్ణభారతీ మహోత్సవంలో భాగంగా బుధవారం విశేష రుద్రహోమం, మహా శివరాత్రి విశేష షట్‌కాల పూజ, సామూహిక రుద్రాభిషేకం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు దేవ భాస్కర్‌రెడ్డి, కేవీ శ్రీనివాస్, శ్రీనివాస్ బంగారయ్య, సూర్యనారయణ శర్మ, గౌరి భాస్కర్, సుధాకర్ శర్మ, శోభనాద్రి, కేవీఎల్ నరసింహమూర్తి, వ్యాప్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి కృషి



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను సంబంధిత మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. మంగళవారం రాత్రి వనస్థలిపురంలోని బీసీ సంక్షేమ హాస్టల్‌ను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఫ్యాన్లు, లైట్లు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతున్న నేపథ్యంలో తమ ఫౌండేషన్ ద్వారా 48 గంటల్లో ఫ్యాన్లు, లైట్లు, అత్యవసర వస్తువులు అందిస్తామని హామీ ఇచ్చారు. హాస్టల్ భవన యజమానితో మాట్లాడి కొత్త తలుపులు, కిటికీలు, బాత్రూమ్‌ల మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్, నాయకులు చెన్నగోని రవిందర్‌గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, దాము మహేందర్ యాదవ్, కొండోజు శ్రీనివాస్, అంతటి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

గ్రాండ్ లాడ్జిలో రికార్డు చోరీ

నాంపల్లి: లాడ్జిలోని రికార్డును చోరీ చేసిన ఘటన హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.యూసుఫియన్ దర్గా సమీపంలోని ఓ లాడ్జిలో ఇద్దరు వ్యక్తులు వచ్చి మేనేజర్ దృష్టి మరల్చి రికార్డు పుస్తకాన్ని దొంగలించారు. అయితే.. రికార్డు పుస్తకాన్ని ఎందుకు దొంగలించారో తెలియాల్సి ఉంది. రికార్డు పుస్తకాన్ని ఎత్తుకెళ్లడంతో పోలీసుల దృష్టి గ్రాండ్ లాడ్జిపై పడింది. ఇందులో ఎవరెవరూ బస చేశారు. ఏయే కార్యకలాపాలు చేపట్టారు. వీరిలో ఎవరెవరు ఉన్నారనే కోణంలో క్రైమ్ పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

రేడియో గ్రాఫర్లకు ఏఐపై అవగాహన

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్ర వ్యాప్తంగా రేడియో గ్రాఫర్లకు అత్యాధునిక పరికరాలైన ఏఐ సాఫ్ట్‌వేర్ పై అవగాహన కల్పించనున్నట్లు ఇండియా సొసైటీ ఆఫ్ రేడియో గ్రాఫర్స్ అండ్ టెక్నాలజిస్ట్ అధ్యక్షుడు ఎం.ఏ అన్సారీ అన్నారు. బుధవారం రేడియో గ్రాఫర్స్ టెక్నాలజిస్ట్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో రేడియో గ్రాఫర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రిటైర్డ్ రేడియో గ్రాఫర్స్ వివరాలు సేకరించి మెడికల్ కాలేజీల వారిగా కమిటీలు వేస్తామన్నారు. రేడియో గ్రాఫర్స్ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. విదేశీ ఉద్యోగ అవకాశాలకు సహాయ సహకారాలు అందించేందుకు సెమినార్‌లు ఏర్పాటు చేయడంతో పాటు జాబ్‌మేళా నిర్వహిస్తామని తెలిపారు. రేడియో గ్రాఫర్స్ అండ్ టెక్నాలజిస్ట్ నేషనల్ సెక్రెటరీ డాక్టర్ కె.జె డానియల్, నేషనల్ వెల్ఫేర్ సెక్రెటరీ శ్రీకుమార్ చంద్రన్, గవర్నింగ్ బాడీ మెంబర్ టోనీ ఆంటోని ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ అన్సారి, ఉపాధ్యక్షులుగా ఎండి అహ్మద్ మోహినొద్దీన్, రహీమా సుల్తానా, కార్యదర్శిగా గడ్డం గంగాధర్, కోశాధికారి లింగరాజు బండి, లీగల్ అడ్వైజర్ ఎం. శ్రీనివాస్, సహాయ కార్యదర్శి ఆర్ మోహిని, బి. సురేష్, విద్యాసాగర్, జేమ్స్ జార్జ్, సభ్యులు సయ్యద్, సుజాత, ప్రభాకర్ గౌడ్, పాండురంగారెడ్డి తదితరులు ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న ఎంఏ అన్సారీ

ప్రొటోకాల్ పాటించరా .?

గౌరీశంకర ఆలయ ఈఓపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం

ముషీరాబాద్: ముషీరాబాద్ శివాలయం చౌరస్తాలోని గౌరీశంకర ఆలయం వద్ద బుధవారం ప్రొటోకాల్ పై వాగ్వాదం చోటు చేసుకుంది. మహాశివరాత్రి ఉత్సవాలపై స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు ఇవ్వలేదంటూ బీఆర్ఎస్ నాయకులు ఆలయ ఈఓ శ్రీనివాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి విజ్ఞప్తి మేరకు ఆలయానికి వచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతూ ఆలయ ఈఓ తమకు సమాచారం ఇవ్వడా అని ప్రశ్నించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రెబ్బరామారావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డి.శివ తదితరులు ఈఓ శ్రీనివాస్‌ను చుట్టుముట్టి మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక ఎమ్మెల్యేను దేవాలయానికి ఆహ్వానించలేదని నిలదీశారు. ఎమ్మెల్యే అంటే మీకు గౌరవం లేదా అని మండిపడ్డారు. గతంలోనూ ఇలాగే వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి వారికి సర్ధిచెప్పడంతో గొడవ సద్దుమనిగింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వంగాల నర్సింగ్‌రావు, సత్యనారాయణ, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ఈఓ శ్రీనివాస్‌ను నిలదీస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దశలవారీగా సమస్యల పరిష్కారం

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని యాకత్‌పురా ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్ అన్నారు. బుధవారం ఆయన బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి గవర్నమెంట్ ప్రెస్ కాలనీవాసులతో సమావేశమయ్యారు. కాలనీలో అంతర్గత రహదారులు, వీధిదీపాలు, తాగునీరు, డ్రైనేజీ సమస్యల గురించి కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్